



ఇది జరిగింది - 15.01.2026 / 930AM

జై శ్రీమన్నారాయణ!

పూజ్య స్వామి వారి పాద పద్మ సముఖమునకు శిరసు వంచి సాష్టాంగ అభివాదం చేస్తూ వినయపూర్వకంగా చేస్తున్న విన్నపం:

స్వామి వారి ఆరోగ్యం సదా సుస్థిరంగా, దివ్యంగా ఉండాలని ప్రార్థిస్తూ...రేపు ఉదయం అనగా 16 జనవరి 26 నాడు, స్వామి వారిని దర్శించి, 25 జనవరి నాడు జరగబోయే అభయ 19వ వార్షికోత్సవ విశేషాలు, సేవా కార్యక్రమాల వివరాలు విన్నవించాలని,

స్వామి వారి ఆశీస్సులతో ఆవిష్కరించబోయే నా స్వీయ ఆత్మకథ గ్రంథం యొక్క మొదటి ప్రతిని స్వామి వారికి సమర్పించుటకు వస్తున్నాను.

దయచేసి కొంత సమయం ప్రసాదించి,

దివ్యాదేశాలతో ఆశీర్వదించాలని ప్రార్థించాను.

#######

ఈ సందేశాన్ని ఉదయం 9:30 గంటలకు పంపితే, స్వామి వారు తమ అపారమైన కృపతో రాత్రి 10.15 గంటల సమయంలో స్పందించారు.

"జై శ్రీమన్నారాయణ, బాలచంద్ర జీ, మీకు సంతోషకరమైన సంక్రాంతి శుభాకాంక్షలు:

మంగళశాసనములతో...చిన్న జీయర్."

ఈ సందేశం నాకెంతో దివ్యానుభూతిని కలిగించింది.

#######

ఈ రోజు అంటే,  16 జనవరి 2026 ఉదయం, అమ్మ గారిని వెంటబెట్టుకుని, "సాయి మార్గంలో...జీవిస్తూ...ప్రేమిస్తూ...పరిమళిస్తూ!* మొదటి ముద్రణ పుస్తక ప్రతులను అందంగా ముఖమల్ వస్త్రంలో చుట్టుకుని, అభయ ఆనంద నిలయం నుండి

ఉదయం 8:30కు బయలుదేరి దివ్య సాకేతం చేరుకున్నాము. సుమారు 9:40 సమయానికి ఆశ్రమ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్నాం.

అక్కడే ఉన్న గోశాలలో కనుమ సందర్భంగా గోపూజ నిర్వహించేందుకు

స్వామి వారు రావడానికి ఏర్పాట్లు జరుగుతున్న దృశ్యం కనిపించింది.

కార్ నుండి దిగి, స్వామి వారి ఆగమనం కోసమై అందరితో పాటు వేచి ఉన్నాము.

ఉరికే ఎందుకు ఉండటం? అనిపించి,

అక్కడ చేరిన భక్తులు మరియు వేదపాఠశాల విద్యార్థులతో కలిసి

భజనలో లీనమయ్యాను.

అదే సమయంలో స్వామి వారు రావడం,

సంకీర్తన చేస్తున్న నన్ను గమనించడం జరిగింది. కన్నులతో పలకరించారు…

కన్నులతోనే అమృతం కురిపించారు.

ఆ క్షణం జీవితాంతం మరచిపోలేని దివ్యానుభూతిని కలిగించింది.

స్వామి వారి ఆదేశం మేరకు

గోవులకు గుమ్మడి కాయతో దృష్టి తీసే భాగ్యం నాకు లభించింది. స్వామి వారి అనుయాయులు నన్ను చూసి ఎంతో ప్రేమతో గోవులు ఆరగించే దానా  పాత్రలను నా చేతుల ద్వారా

స్వామి వారికి అందించే అవకాశం కల్పించారు. కనుమ రోజు గోవులను సేవించే భాగ్యం...అది కూడా స్వామి వారి సమక్షంలో దొరికిన అత్యంత అరుదైన, అపూర్వమైన సేవావకాశం.

ఆ సందర్భంలో స్వామి వారికి విన్నవించాను — "స్వామి… మొదటి పుస్తకాన్ని తీసుకుని వచ్చాను. అమ్మ గారు కూడా స్వామి దర్శనార్థం వచ్చారు" అని.

గోసేవ అనంతరం, ఆ హడావుడిలో...

స్వామి వారు నన్ను చూసి —

"పుస్తకం ఎక్కడ?" అని అడిగి,

"తెమ్మని" సైగ చేసారు.

ఆ మాట నేను ఊహించనిది.

పరుగెత్తుకుంటూ కార్ వద్దకు వెళ్లి

పుస్తకాల మూటను తీసుకుని,

అమ్మను వెంటబెట్టుకుని స్వామి వారి సముఖానికి చేరుకున్నాను.

స్వామి వారు అపారమైన దయతో

పుస్తకాన్ని ఆవిష్కరించి,

మంగళాశాసనాలు అందించారు.

అమ్మను పలకరించినారు

ఆశీర్వాదాలను చిలకరించారు.

మేమెంతో పులకరించినాము.

దైవ నామాన్ని పలువరించినాము.

#######

ఆ తరవాత స్వామి వారు ఏకాంత సౌధ సంభాషణ అనుగ్రహించారు. పుస్తకం మీద వారి స్వహస్తములతో మంగళాశాసనములు వ్రాసి చెవ్రాలు చేసినారు. అభయ సేవా కార్యక్రమాల గురించి వింటూ...ఇచ్చిన చిత్ర మాలికలు చూస్తూ... భవిత కార్యం గురించి తెలుసుకుంటూ... చాలా సంతోషించారు.

వారు వార్షికోత్సవ సమయంలో పర్యటనలో ఉండటం తెలుసుకుని స్వామి వారిని అభయ సంస్థ సభ్యులకు సందేశం ఇవ్వమని అర్థించాను.

ఎంతో కరుణతో స్వామి వారు మంగళశాసనములు అందించారు.

ఏమని వర్ణించాలి వారి దయను?

ఏమని వివరించాలి వారి ప్రేమను?

ఏమని చెప్పాలి వారి కరుణను?

"అభయ" కు స్వామి వారి అభయం సర్వదా ఉంటుందన్న భావన

మమ్మల్ని అపారమైన ఆనందంలో ముంచెత్తింది.

ఇది కేవలం ఒక సంఘటన కాదు —ఇది దైవానుగ్రహం, ఇది కృపా ప్రసాదం, ఇది జీవితాంతం హృదయంలో నిలిచిపోయే దివ్యస్మృతి. వారి పాద పద్మాలకు నమస్కరిస్తూ...జై శ్రీమన్నారాయణ!

ప్రేమతో...ప్రార్థనలతో!

బాలచంద్ర